

వెల్లివిరిసిన సంతోషం
కర్నూలులో వైఎస్సార్ సర్కిల్ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసిన క్షణంలో చేతులెత్తి సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న ప్రజలు.



ఘన స్వాగతం
సభా స్థలికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కారులో వస్తుండగా ప్రజలు భారీగా తరలివచ్చి స్వాగతం పలుకుతున్న దృశ్యం.



మహిళల అ'జెండా'
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేయడంతో ఆ పార్టీ జెండాలు పట్టుకుని సభాస్థలికి వస్తున్న మహిళలు.

ఎవరేమన్నారంటే...

జగనన్నతోనే సుపరిపాలన సాధ్యం

గతంలో ఎన్నడూ చూడని విధంగా రాష్ట్రంలో ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలు అందాయి. గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో అభివృద్ధి జరిగింది. ముప్పై ఏళ్ల కలెక్టర్‌గా పనిచేసిన నేను జగనన్న పాలన నచ్చి పదవికి రాజీనామా చేశా. ప్రజా సేవ చేసేందుకు వచ్చా. మరో ఐదేళ్ల పాటు ప్రజలకు సంక్షేమ పాలన కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి.

– ఏఎండీ ఇంతియాజ్,
కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి

నల్ల చట్టాలను రద్దు చేసే దమ్ము చంద్రబాబుకు ఉందా?

జగనన్నను ఎదర్కొనలేక తెలుగుదేశం పార్టీ .. జనసేన, బీజేపీలను కలుపుకొని కూటమిగా వస్తోంది. ఎంత మంది వచ్చినా జగనన్నను ఓడించలేరు. వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చారు. వాటిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తూ మైనార్టీలకు అండగా నిలిచారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటించిన బీజేపీతో చంద్రబాబు నాయుడు జత కట్టారు. చంద్రబాబుకు దమ్ము ఉంటే బీజేపీ అమలు చేస్తున్న నల్ల చట్టాలను రద్దు చేస్తామని ప్రకటించాలి.

– ఎంఏ హఫీజ్‌ఖాన్,
కర్నూలు ఎమ్మెల్యే

మళ్లీ జగనన్నను గెలిపించుకుందాం

కర్నూలు, పులివెందుల వైస్సార్‌సీపీ అడ్డా. ధర్మం, అధర్మం, నీతి, అవినీతి మధ్య జరుగుతున్న పోరులో విజయం మనదే. పూలే, అంబేడ్కర్ ఆశయాలు జగనన్న పాలనలో నెరవేరాయి. గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం జగనన్న ప్రభుత్వంలో నిజమైంది. 139 కులాలను గుర్తించి వారికి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా గౌరవించిన పార్టీ వైఎస్సార్‌సీపీ. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం మళ్లీ అమలు కావాలంటే జగనన్నను గెలిపించుకోవాలి. ప్రజల మద్దతు ఉన్న జగనన్నను ఓడించేందుకు తోడేళ్లన్నీ ఏకమయ్యాయి. ఎల్లో మీడియా కుట్రలు చేస్తోంది. తిప్పి కొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలి.

– బీవై రామయ్య,
కర్నూలు ఎంపీ అభ్యర్థి

చంద్రబాబు ఏనాడైనా సంక్షేమాన్ని పట్టించుకున్నాడా?

2004నుంచి 2009 వరకు 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో జరిగిన పాలనను ప్రజలు గుర్తు తెచ్చుకోవాలి. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రిదే. అలవి కానీ హామీలు ఇచ్చి ఎలాగైన అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. ఆయన ఏనాడైనా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకున్నాడా? 40 సంవత్సరాల ఇండస్ట్రీ, 15 సంవత్సరాల ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు ఒక్క మంచి పథకం అమలు చేయలేదు. మీదివేముల గ్రామంలో భూములు ఆక్రమించినారని నిరూపిస్తే వారికే రాసిస్తా.

– కాటసాని రాంభూపాల్ రెడ్డి,
పాణ్యం ఎమ్మెల్యే

ఒక్క నెల ఆగండి.. పథకాలన్నీ ఇంటికే

ఒక్క నెల ఆగండి. జగనన్న సంక్షేమ పథకాలు అన్నీ ఇంటికే వస్తాయి. చంద్రబాబు నాయుడు వలంటీర్ వ్యవస్థ అడ్డుకున్నారు. సంక్షేమ పథకాలు అందకుండా ఎన్నో కుట్రలు చేశారు. ప్రజలు గమనిస్తున్నారు. ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెబుతారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించండి

– విజయ మనోహరి,
కేడీసీసీ బ్యాంకు చైర్మన్



ఆశీర్వదించండి: కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను, ఎమ్మెల్యే అభ్యర్థులు కాటసాని, ఇంతియాజ్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తున్న సీఎం వైఎస్ జగన్

జన సునామీ
ఇసుకేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిన కర్నూలులోని వైఎస్సార్ సర్కిల్ ప్రాంతం

ఉప్పొంగిన అభిమానం..
ఉరకలేసిన ఉత్సాహం



ఇదే మన గుర్తు
బహిరంగ సభలో ఫ్యాన్ గుర్తును ప్రజలకు చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్

కర్నూలు జనసంద్రం!!

- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ఉప్పెనలా తరలివచ్చిన జనం
- జనసంద్రమైన వైఎస్సార్ సర్కిల్ నాలుగు రోడ్ల కూడలి
- జగన్ ప్రసంగం ఆద్యంతం ప్రజల్లో రెట్టించిన ఉత్సాహం
- ప్రచారసభ విజయవంతంతో కదనోత్సాహం.. శ్రేణుల్లో నయాజోష్
- వలంటీర్ల సేవలు, పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్‌కు ఓటేయాలని పిలుపు
- మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లతో పాటు వారి ఇజ్జత్, ఇమాన్‌లకు అండగా ఉంటానని హామీ
- అధినేత పర్యటనతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు

జగన్.. జగన్.. జగన్.. మండు టెండను సైతం లెక్కచేయని అభిమానం. ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా వేలాది జనం ఉప్పెనలా కదిలారు. సీఎం.. సీఎం.. సీఎం.. ఎవరి నోటా విన్నా ఇదే మాట. ప్రచారం తుది దశకు చేరుకుంటున్న వేళ కర్నూలులో అడుగుపెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన సముద్రంలో తడిసి ముద్దయ్యారు. మీ అడుగులో అడుగులై కదులుతామంటూ పార్టీ శ్రేణులు, అభిమానులు ఒక్కటై నినదించారు. తూటాల్లాంటి మాటలతో ప్రతిపక్షాలపై విరుచుకుపడుతూనే.. భవిష్యత్తుకు నాది గ్యారెంటీ అనే భరోసా కల్పించారు. మీ ఓటు బాధ్యత మాత్రమే కాదని.. పేదల జీవితాలను మార్చే వజ్రాయుధమని దిశానిర్దేశం చేయడంతో ప్రజలు తమ చేతులను గాల్లోకి తిప్పుతూ ప్రభంజనం సృష్టిస్తామని విశ్వసనీయత తను చాటుకోవడం విశేషం.

బాబోరు మళ్లీ వద్దు.. సీఎం వైఎస్ జగనే రావాలి

చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారంలోకి రావద్దని, ఆయన పాలకుడు అయితే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని ఎన్నికల ప్రచార సభకు వచ్చిన జనాలు నినదించారు. వద్దు వద్దు బాబోరు మళ్లీ అంటూ చేతులు ఊపి మరీ చెప్పారు. సీఎంగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి వస్తేనే అమ్మ ఒడి, చేయూత, ఆసరా, రైతు భరోసా, 4 శాతం ముస్లింల రిజర్వేషన్లు అందుతాయంటూ జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కర్నూలుకు విచ్చేశారు. ఉదయం 11గంటలకు హెలికాప్టర్‌లో ఎస్టీబీసీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. నేతలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అక్కడి నుంచి వైఎస్సార్ సర్కిల్ మీదుగా ఎస్టీబీసీ కాలేజీ మెయిన్ గేట్ వద్ద ఏర్పాటు చేసి బస్సు వద్దకు చేరుకున్నారు. ఈ రోడ్డు మొత్తం జనంతో నిండిపోవడంతో సీఎం కాన్వాయ్ ముందుకు కదల్లేదు. హెలిప్యాడ్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ 15 నిమిషాలు పట్టింది. జనం మధ్య కాన్వాయ్ రావడంతో 'జైజగన్.. సీఎం.. సీఎం' అంటూ కార్యకర్తలు నినదించారు. కారులో ఉన్న తమ అభిమాన నేతను చూసేందుకు ఎగబడ్డారు. అభిమానులు, కార్యకర్తలకు నమస్కరిస్తూ, అభివాదం చేసుకుంటూ జగన్ ముందుకు కదిలారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, కర్నూలు, నంద్యాల ఎంపీ అభ్యర్థులు బి.వై. రామయ్య, పోచా బ్రహ్మానందరెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయమనోహరి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, నాయకులు గడ్డం రామకృష్ణ సీఎంకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. నాయకులు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్, పార్టీ నాయకులు సీహెచ్‌మద్దయ్య పాల్గొన్నారు.



యువోత్సాహం
సీఎం జగన్ ప్రసంగానికి జేజేలు పలుకుతున్న యువకులు

సీఎం ప్రసంగం ఆద్యంతం రెట్టించిన ఉత్సాహం

జగన్ సభాస్థలికి చేరుకుని ప్రసంగం ప్రారంభించే సమయానికి 11.33 గంటలైంది. ఎండవేడిమి ఉన్నా అభిమాన నేత ప్రసంగాన్ని ప్రజలు ఓపిగ్గా విన్నారు. ముస్లిం రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తామని చెప్పిందని, వారికి 4శాతం ఉండి తీరాల్సిందేనని జగన్ చెప్పడంతో మైనార్టీలు ఈలలు, కేకలతో హోరెత్తించారు. వారి ఇజ్జత్ ఔర్ ఇమాన్‌లకు అండగా ఉంటానని హామీ ఇవ్వడంతో 'సీఎం సీఎం' అంటూ సభ దద్దరిల్లేలా మద్దతిచ్చారు. దీంతో కొన్ని సెకన్లు ప్రసంగం ఆపేసి సీఎం కూడా చిరునవ్వులు చిందించారు. మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేస్తామనే బీజేపీతో చంద్రబాబు జట్టు కట్టారని, రాజకీయ స్వార్థం కోసం మైనార్టీల నోటి దాకా వచ్చిన కూడును తీసేయాలనుకోవడం ఎంత వరకూ ధర్మం అని సీఎం చేసిన ప్రసంగానికి మైనార్టీల నుంచి మంచి స్పందన వచ్చింది. మరో నాలుగు రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయని.. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలిచేందుకు మాత్రమే వేసే ఓటు కాదని, పేదల జీవితాలను మార్చేందుకు వేసే ఓటు అని జగన్ చేసిన ప్రసంగానికి పేద ప్రజల నుంచి మద్దతు వచ్చింది. తమ ప్రభుత్వం ఏ పథకాలను అమలు చేశాం? ఏ వర్గాలకు ఎంత మేలు చేశాం? చంద్రబాబు ఎలా మోసం చేశారు అనే అంశాలను క్షుణ్ణంగా వివరించారు. మొత్తం ప్రసంగం ఆద్యంతం ప్రజలు, కార్యకర్తలు ఉత్సాహంతోనే ఈలలు, కేకలు వేస్తుండటం విశేషం. 'ఫ్యాన్' గుర్తుకు ఓటు వేయాలని 'ఫ్యాన్' గుర్తు చూపించగా జనం మొత్తం వేళ్లు తిప్పుతూ సందడి చేశారు. 'అవ్వా మన గుర్తు ఫ్యాన్, తాతా మన గుర్తు ఫ్యాన్' అంటూ చెబుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రసంగం తర్వాత జనం మొత్తం చిందులేశారు. వారి ఉత్సాహాన్ని చూస్తూ 'నమస్కరిస్తూ' చిరునవ్వులతో జగన్ వీడ్కోలు చెప్పారు. అక్కడి నుంచి తిరిగి హెలిప్యాడ్ చేరుకున్నారు. నాయకులు జగన్‌కు వీడ్కోలు పలికారు. ఆపై అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ప్రచారానికి సీఎం వెళ్లారు. సభా ప్రాంగణంలో కాండీబెలూన్‌లను ఎగరేశారు. వైఎస్సార్‌సీపీ జెండా రంగులో ఉండే బెలున్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మాజీ మేయర్ బంగి అనంతయ్య తన అనుచరులతో భారీ జెండాలు తీసుకొచ్చి సందడి చేశారు.

అభ్యర్థులను గెలిపించాలని వినతి

అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు విన్నవించారు. 'కర్నూలు నుంచి ఇంతియాజ్ అన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఐఏఎస్ అధికారిగా రాజీనామా చేసి ప్రజలకు సేవ చేయాలని వచ్చారు. బ్రహ్మాండమైన చదువులు చదివారు. మీ అందరికీ మంచి చేస్తారనే సంపూర్ణ విశ్వాసం ఉంది. మంచి మెజార్టీతో గెలిపించండి. అలాగే ఎంపీ అభ్యర్థిగా రామయ్య అన్న నిలుచున్నారు. మీలో ఒకరు. అతి సామాన్యుడు. బీసీ కులానికి చెందిన వాడు. ఇలాంటి పేద వ్యక్తిని ఎంపీగా గెలిపించి, పేదవారు కూడా ఢిల్లీకి రాగలరని ఢిల్లీకి చెబుదాం. రామయ్యన్నను మంచి మెజార్టీతో గెలిపించాలి. అలాగే కాటసాని రాంభూపాల్‌రెడ్డిన్న ఉన్నారు. నేను అన్నను సీనియర్ మోస్ట్ ఎమ్మెల్యే అంటుంటాను. సౌమ్యుడు, మంచివాడు, మీ అందరికీ మంచి చేస్తారు. అన్నను గొప్ప మెజార్టీతో గెలిపించాలి' అని కోరారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఆప్యాయతలను చూపిన అందరినీ మీ బిడ్డ పేరు పేరునా నమస్కరిస్తున్నారని చెప్పారు.



వృద్ధుడి ఉత్సాహం: జననేతను చూసిన ఆనందంలో..

వైఎస్సార్‌సీపీలో జోష్

కర్నూలు నగర పరిధిలోని కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సీఎం పర్యటన కొత్త ఉత్సాహాన్ని నింపింది. జనం బలం లేక డబ్బు మూటలతో గెలవాలని టీడీపీ నేతలు భావించారు. అయితే ముఖ్యమంత్రి పర్యటనకు తరలివచ్చిన జనం, వారి ఉత్సాహం, సభ తర్వాత వారి స్పందన చూసి వంద శాతం కర్నూలు అసెంబ్లీలో గెలవబోతున్నామని, కొండారెడ్డి బురుజుపై మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరబోతోందని సర్వత్రా చర్చ జరిగింది.



విజయం మనదే: సభలో సామాన్యుల చేతిలో వైఎస్సార్‌సీపీ జెండాల రెపరెపలు



అన్నను చూడాలని..
చెట్టుపై నుంచి జగన్‌ను చూస్తూ..

జన కెరటం.. సభకు తరలివచ్చిన అశేష జనం





నమస్తే.. నమస్తే.. అభివాదం చేస్తున్న జననేత





సోదరా.. విజయం మనదే..
ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను ఎత్తుకున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ఫ్యాన్స్ ప్రభంజనం

రాయలసీమ ముఖద్వారం కర్నూలు జనసంద్రమైంది. వైఎస్సార్ సర్కిల్‌లోని నాలుగు రోడ్ల కూడలి పోటెత్తి కనిపించింది. అభిమాన నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు ప్రజలు ప్రవాహంలా తరలివచ్చారు. ఈలలు, కేకలతో.. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగానికి విశేష స్పందన లభించింది. చంద్రబాబును నమ్మేది లేదంటూ చేతులు ఎత్తి ప్రజలు సంఘీభావం తెలిపారు. ఫ్యాన్ గుర్తు చూపించిన సందర్భంలో వేళ్లు తిప్పుతూ సందడి చేశారు. సభ విజయవంతం కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేసింది. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తుందన్న నమ్మకం ప్రజలందరిలోనూ కనిపించింది. – కర్నూలు



ఆకాశమే హద్దుగా.. యువకుడి ఉత్సాహం



ఆనందమానందమాయె.. జననేతను చూసిన ఆనందంలో అభిమానుల కోలాహలం



చరిత్ర సృష్టిస్తాం.. ప్లకార్డ్‌తో అభిమాని



ఇలా.. ఇలా.. ఇలా... జగనన్న మాటలకు స్పందిస్తూ..



పకడ్బందీగా.. ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐజీ విజయారావు తదితరులు



మేమంతా సిద్ధం.. పార్టీ శ్రేణులతో సభకు చేరుకుంటున్న బీవై రామయ్య

'సొంత పిన్నిపై దాడి చేయిస్తారా?

- మాజీ మంత్రి అఖిల ప్రియకు ఓట్లతోనే బుద్ధి చెబుతారు
- వైఎస్సార్‌సీపీ నేత భూమా కిశోర్‌రెడ్డి



ఆళ్లగడ్డ: ఎన్నికల సందర్భంగా వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేస్తున్న సొంత పిన్నిపై మాజీ మంత్రి అఖిల ప్రియ దాడి చేయించడం దారుణమని వైఎస్సార్‌సీపీ నేత భూమా కిశోర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం రాత్రి దొర్నిపాడు మండలం డబ్ల్యూ. కొత్తపల్లెలో జరిగిన ఘటనపై ఆయన పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామంలో సొంత చిన్నాన్న, ఆయన కొడుకు ప్రచారం చేస్తుంటే ఓటమి భయంతో టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతుండగా అడ్డుకోబోయిన పిన్నిపై దాడి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. దౌర్జన్యాలకు పాల్పడే టీడీపీ నేతలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. డబ్ల్యూ. కొత్తపల్లె ప్రజలు భయపడొద్దని, పోలింగ్ రోజున ఏజెంట్లుగా తాము కూర్చుంటామని, స్వేచ్ఛగా ఓటు వేయాలని సూచించారు. మంత్రిగా సొంత గ్రామానికి ఏమి చేయని అఖిల ప్రియ దౌర్జన్యాలకు మాత్రం పాల్పడుతుందని విమర్శించారు.

నగదు, మద్యం పంపిణీపై ప్రత్యేక నిఘా

కర్నూలు(సెంట్రల్): ఇది అత్యంత కీలకమైన సమయం అని, మద్యం, నగదు పంపిణీపై స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు(ఎస్ఎస్‌టీ) ప్రత్యేక నిఘా ఉంచాలని ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి నీనానిగమ్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై జనరల్ అబ్జర్వర్ జాఫర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, ఎన్నికల వ్యయ పరిశీలకులతో కలసి ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి రాజకీయ పార్టీలు డబ్బు, మద్యం పంపిణీ చేస్తాయన్నారు. వీటిని అడ్డుకోవడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం దుకాణాలు, బార్లను తనిఖీ చేసే సమయంలో సీటింగ్ సామర్థ్యాన్ని బట్టి అమ్మకాలు ఉన్నాయో లేదో పరిశీలన చేయాలన్నారు. అబ్జర్వర్లు, వ్యయ పరిశీలకులు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో పక్కా ప్రణాళికలతో వ్యవహరిస్తే మద్యం, డబ్బు పంపిణీని అరికట్టవచ్చన్నారు. రాత్రి వేళల్లో ఆకస్మికంగా తనిఖీలు చేయాలన్నారు. ఓటర్ల స్లిప్పు ద్వారా యూపీఐ లావాదేవీలు జరిగే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అభ్యర్థులు ఓటరు స్లిప్పులను పంపిణీ చేయరాదని, చేస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ..ఇప్పటి వరకు 17వేల లీటర్ల మద్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆర్ఆర్ శుక్లా, రాకేష్ భడాదియ, అరిందం ముఖోపాధ్య, ఎస్.మణికందన్, కిరణ్, అశోకన్,టీకారాం మీనా పాల్గొన్నారు.

విరూపాక్షిపై హత్యాయత్నం



దాడికి యత్నించిన వ్యక్తి

ఆలూరు రూరల్: ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షిపై హత్యాయత్నం జరిగింది. గురువారం చిప్పగిరి మండల కేంద్రంలో విరూపాక్షి కార్యకర్తలు, నాయకులతో కలిసి ప్రచారం నిర్వహిస్తుండగా గుంతకల్లు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కత్తితో దాడికి యత్నిస్తుండగా కార్యకర్తలు గుర్తించి ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వ్యక్తిని అదుపులో తీసుకున్న పోలీసులు ఎవరు పంపించారు? ఎక్కడి నుంచి వచ్చి దాడికి ప్రయత్నించాడన్న కోణంలో విచారిస్తున్నట్లు సమాచారం. ఓ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిపై హత్యాయత్నం ఘటనతో నియోజకవర్గంలో ఒక్క సారిగా కలకలం రేపింది. ఈ విషయమై సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా గుంతకల్లుకు చెందిన వ్యక్తిని అదుపులో తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు.

దాహం తీరేలా..

- 28 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీరు
- జీడీపీ నుంచి హంద్రీ తీర గ్రామాలకు తాగునీరు

కర్నూలు(అర్బన్): పలు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఇప్పటికే ఉత్పన్నమైన తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలను చేపట్టింది. సమీపంలోని వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకొని ట్యాంకర్ల ద్వారా గ్రామ ప్రజల అవసరాల మేరకు నీటిని అందించే కార్యక్రమాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు ప్రారంభించారు. ప్రస్తుత వేసవిలో తప్పక నీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉంటాయని ముందుగానే ఒక అంచనాకు వచ్చిన అధికారులు వేసవి ప్రారంభం కాక ముందే గ్రామ సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా గ్రామ ప్రజల జనాభా, నీటి అవసరాలపై వాటర్ ఆడిట్ నిర్వహించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు జిల్లాలోని వేర్వేరు మండలాల్లోని 128 గ్రామాల్లో నీటి సమస్య తలెత్తుందనే ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ నిర్వహించిన ఆడిట్ నివేదికలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ద్వారా ఎంపీడీఓ, జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్‌కు పంపారు. జిల్లా కలెక్టర్ పంపిన నివేదికలపై ఆయా నెలల్లో ఆయా ప్రాంతాల్లో ఉత్పన్నమయే నీటి సమస్యను అధిగమించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయి. ఈ మేరకు ప్రస్తుతం తీవ్ర తాగు నీటి ఎద్దడి నెలకొన్న 28 గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నీటి సరఫరాలో ఎక్కడా అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ యాప్ ద్వారా ట్రిప్పులను లెక్కగడుతున్నారు. ఆయా గ్రామాల్లో జనాభాను బట్టి మూడు నుంచి ఐదు ట్రిప్పుల వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందుకు 5 కిలోమీటర్ల దూరానికి ఒక ట్రిప్పుకు రూ.567, 10 కిలోమీటర్లకు రూ.718, 15 కిలోమీటర్లకు రూ.869లను చెల్లించనున్నారు. అలాగే జూన్ నెల వరకు నీటి ఎద్దడి తలెత్తనున్న గ్రామాల ప్రజలకు నీటిని అందించేందుకు ఇప్పటికే రూ.12 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు.



పుష్పాలదొడ్డి గ్రామంలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు



తొగలగల్లు గ్రామంలో ట్యాంకర్ నీటిని అందిస్తున్న దృశ్యం

జీడీపీ నుంచి హంద్రీ తీర గ్రామాలకు ...

హంద్రీనది తీర గ్రామాల్లోని ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జలవనరుల శాఖ,ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ల సమన్వయ ంతో ప్రత్యేక చర్యలు చేపట్టారు.హంద్రీ తీరం వెంట ఉన్న గోనెగండ్ల, కోడుమూరు, గూడూరు మండలా ల్లోని పలు గ్రామాలకు గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని అందిస్తున్నారు. జీడీపీ నుంచి ఇప్పటికే రెండు పర్యాయాలు హంద్రీకి నీటిని విడుదల చేయడం వల్ల ప్ర ధానంగా కోడుమూరు దాహార్తిని కొంతమేర తీర్చడ ంతోపాటు పలు గ్రామాలకు నీటిని అందిస్తున్నారు.

28 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ...

నీటి ఎద్దడి నెలకొన్న పుష్పాలదొడ్డి, తొగలగల్లు, తురవగల్లు, తంగరడోణ, కల్లుదేవకుంట, చెట్నేహళ్లి, సోయాజులపల్లి, హుసేనాపురం, శకునాల, తిప్పాయిపల్లి, చెన్నంశెట్టిపల్లి, వెంకటాపురం, పెరవలి, రేమట, గువ్వలకుంట్ల, చిన్న జొన్నగిరి, జొన్నగిరి, హుసేనాపురం, బాటతాండా, పగిడిరాయి కొత్తూరు, దేశాయితాండా, వాగులగుడిసెలు, గుడిసెగుప్పరాళ్ల, పీ చింతలకొండ, శభాష్‌పురం, కడమకుంట్ల, తుగ్గలి గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



ఓటు హక్కు వినియోగించుకుంటున్న పోలీసు కానిస్టేబుల్

నంద్యాల: జిల్లాలోని ఒక పార్లమెంట్, ఆరు అసెంబ్లీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నాలుగు రోజులుగా ఎన్నికల అధికారులు ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ ఫెసిలిటేషన్ సెంటర్‌ల్లో నిర్వహించారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 17,939 మంది ఓటర్లు ఉండగా అందులో 16,808 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాల్గవ రోజు గురువారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 14 మంది ఓటర్లు, శ్రీశైలంలో 138, నందికొట్కూరులో 62, డోన్‌లో 64, నంద్యాలలో 198, బనగానపల్లెలో 45 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో హోమ్ ఓటింగ్ కింద 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు జిల్లాలో 904 మంది ఉండగా 509 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రసూల్ వైఎస్సార్‌సీపీలో చేరిక

సాక్షి ప్రతినిధి కర్నూలు: భారత కమ్యూనిస్టు పార్టీలో సుదీర్ఘకాలం పని చేస్తూ ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఎస్ఎన్ రసూల్ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు ప్రచార సభ దగ్గర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు పనిచేస్తానని, ఏ బాధ్యతలు అప్పగించినా నెరవేర్చి మంచి పేరు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎస్ఎన్ రసూల్ 'సాక్షి'కి తెలిపారు.



ఎస్ఎన్ రసూల్‌కు పార్టీ కండువా వేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

హత్యాయత్నానికి పాల్పడిన నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బొమ్మలసత్రం: పట్టణంలోని స్థానిక శ్రీనివాస సెంటర్ సమీపంలో నడిరోడ్డుపై బుధవారం షేక్ బాబాఫక్రుద్దీన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ చలపతి తెలిపిన వివరాల మేరకు.. శ్యామకాలవ సమీపంలో నివసిస్తున్న చాకలి మధురాజు, చాకలి మాధవ, వడ్డె రాజశేఖర్, పెద్ద మాతంగి లక్ష్మయ్య, చంద్రశేఖర్ బార్‌లో మద్యం సేవించి మద్యం మత్తులో అక్కడే ఉన్న బాబా ఫక్రుద్దీన్‌పై బీర్ సీసాతో దాడి చేశారు. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో బయటకు వచ్చినా వదిలేయకుండా నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా గొంతును కాలితో నులిమి హత్యచేసేందుకు యత్నించారు. స్థానికులు తిరగబడటంతో ఐదుగురు నిందితులు పరారయ్యారు. బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుని తండ్రి జమాల్‌వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్పీజీ గ్రౌండ్‌లో నిందితులు ఉన్నట్లు తెలుసుకుని అరెస్ట్ చేశారు. ఈ మేరకు కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారు.